06ATP27_06ATP27.qxd 22-01-2026 PM 10:38 Page 1



## పలు కార్యాయలను తనిఖీ చేసిన ఆర్డిఓ

రామగిరి, జనవరి 22 ప్రభాతవార్త



తనిఖీ చేస్తున్న ఆర్డిఓ

రామగిరి మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారి సమీక్షించారు. **తహశీల్దారు కార్యాలయం తనిఖీ :** రామగిరి తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్‌డిఓ తనిఖీ చేసి, పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిజిఆర్‌ఎస్ గ్రీవెన్స్‌లు, రెవెన్యూ క్లినిక్ గ్రీవెన్స్‌లు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, మ్యూటేషన్ రిజిస్టర్, పిజిఆర్‌ఎస్ రిజిస్టర్, రెవెన్యూ క్లినిక్ రిజిస్టర్‌లను సమీక్షించారు. ప్రజా సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరించేలా నిర్లక్ష్యం లేకుండా చర్యలు చేపట్టాలని, రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే కార్యాలయంలో సిబ్బంది హాజరు, అందుబాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ప్రజలకు ఎప్పటికప్పుడు సేవలు అందేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.

**రీ-సర్వే పరిశీలన :** రామగిరి మండలంలోని రామగిరి గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను ఆర్‌డిఓ పరిశీలించారు. రీ-సర్వే నోటీసుల పంపిణీ, సర్వే పనుల ఖచ్చితత్వం, భూసరిహద్దుల స్పష్టత, రికార్డుల సమన్వయం వంటి అంశాలను సమీక్షించి, రీ-సర్వే ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రీ-సర్వే ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఓ కోరారు.

**జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల తనిఖీ :** రామగిరి మండలంలోని కుంటిమద్ది మరియు రామగిరి గ్రామాలలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను ఆర్‌డిఓ తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యత,పరిశుభ్రత, అలాగే బోధన విధానం మరియు విద్యా ప్రమాణాలను సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మరియు మెరుగైన విద్య అందేలా పాఠశాల సిబ్బంది నిరంతరం శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

## జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌ను కలిసిన జిల్లా చౌకధాన్యం డిపో డీలర్ల సంఘం

**- నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు సన్మానించి శుభాకాంక్షలు**

ఉరవకొండ, జనవరి 22 ప్రభాతవార్త



జిల్లా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సి.విష్ణుచరణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ (జిలా ్ల సంయుక్త కలెక్టర్) సి.విష్ణు చరణ్‌ను గురువారం జిల్లా చౌనధాన్యం డిపో డీలర్ల సంఘం బాధ్యులు కలిసారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇంచార్జ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని షాలువాకప్పి సన్మానించి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌకధాన్యం డిపో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు జి.బండయ్య, కార్యదర్శి బోయ రాము అనంతపురం నగర అధ్యక్షులు బోయ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం బాగోలేదు.. తరచూ ఫోన్ చూడవద్దు అన్నందుకే కలత చెంది ఆత్మహత్య

అగళి, జనవరి 22 ప్రభాతవార్త



ఆత్మహత్య చేసుకున్న భూమిక

మండల పరిధిలోని ఉల్లెకెర గ్రామానికి చెందిన భూమిక(19) కంది చేను పంటకు కొట్టే పురుగు మందు గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శోభరాణి, ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మహత్య చేసుకున్న భూమిక దీర్ఘకాలిక వ్యాధి (టిబి) బాధపడేది. కర్ణాటక రాష్ట్రం తుంకూరులో ఉన్న శ్రీదేవి ఆసుపత్రిలో చికిత్స పొందింది. జబ్బు ఎంతకీ న్యాయం కాకపోవడంతోపాటు, వయస్సులో రుతుమతి అయిన తర్వాత రుతుమతి కానందున తరచూ ఫోన్ చూస్తూ కాలం గడిపేది. తరచూ ఫోన్ చూడవద్దని ఇంట్లోవారు చెప్పడం తనకు టిబి రోగం నయం కాకపోవడం, వీటికి కలత చెంది విషగుళికలను మింగింది. విషగుళికలను తీసుకున్న తర్వాత వాంతులు కావడంతో ఇంటిలో వారికి అనుమానం వచ్చి శిర ఆసుపత్రికి, అక్కడి నుంచి తుమకూరు జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. భూమిక తండ్రి రంగస్వామి ఫిర్యాదు మేరకు అగళి ఏఎస్ఐ శ్రీరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షణికావేశంతో విలువైన జీవితాలను పాడు చేసుకోవద్దని ఎస్ఐ శోభరాణి ఈ సందర్భంగా తెలిపారు.

## పారిశుద్ధ్య పనుల వినియోగానికై ట్రాక్టర్ మంజూరు

**వడిగేపల్లి సర్పంచ్ నరసింహ మూర్తి, కార్యదర్శి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పంపిణి.**

గోరంట్ల జనవరి 22 ప్రభాతవార్త.



సర్పంచ్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ పంపిణీ

మండలంలోని వడిగేపల్లి గ్రామపంచాయతీ ప్రజల సౌకర్యర్థం రాష్ట్ర ప్రభుత్వం నూతన ట్రాక్టర్ ను మంజూరు చేయడంతో అధికారులు మరియు నాయకుల చేతుల మీదుగా గురువారం సర్పంచ్ నరసింహ మూర్తి, కార్యదర్శి నాగార్జున రెడ్డి లకు మంజూరైన ట్రాక్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసింహమూర్తి మాట్లాడుతూ వడిగేపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ కోసం ఈట్రాక్టర్‌ను నిరంతరం ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఈ నారీ కార్యక్రమం పై మహిళ సంఘాలకు శిక్షణ తరగతులు

అమరాపురం జనవరి 22 ప్రభాతవార్త



శిక్షణ ఇస్తున్న దృశ్యం

అమరాపురం మండల కేంద్రంలోని స్థానిక హేమ మహిళ సమాఖ్య భవనంలో గురువారం నిర్వహించిన ఈ నారీల శిక్షణ తరగతులను మహిళా సంఘాల అధ్యక్షురాలు సుజాతమ్మ, ఉపాధ్యక్షురాలు సుమ, ఏటీఎం ముత్యాలప్ప ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడమే ఈనారీలు, సిఆర్పిల ముఖ్య ఉద్దేశమని ఏపీఎం ముత్యాలప్ప తెలిపారు. మండల కేంద్రంలోని హేమ మహిళా మండల్ సమాఖ్య కార్యాలయంలో ఈనారీలకు శిక్షణ తరగతులను టిఓటిలు భాస్కర్, వీరేష్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు, శ్రీనిధి, వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాదులకల్పనతో పాటు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి సాధించే విధంగా తీర్చి దిద్దాలన్నారు. ప్రతి సభ్యురాలు చరవాణి ద్వారా మన డబ్బులు మన లెక్కలు అనే యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఆర్థిక లావాదేవి లను ఎప్పటికప్పుడు తెలియజేయడం వల్ల మోసాలను అరికట్టవచ్చని సీఆర్పీలు క్షుణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హేమ మండలమహిళా సమైక్య అధ్యక్షురాలు సుజాతమ్మ ఉపాధ్యక్షురాలు సుమ ఏపిఎం ముత్యాలప్ప టి ఓ టి లు భాస్కర్, వీరేష్, సీసీలు నాగరాజు, గోపాల్, ఎఫ్ పి ఓ సీసీ శ్రీనివాసు, అకౌంటెంట్లు, వరలక్ష్మి, కేంచమ్మ, మహిళా సంఘాల సభ్యులు తదితరుల పాల్గొన్నారు.

## నారాలోకేశ్ జన్మదిన, పరిటాల రవీంద్ర వర్ధంతి వేడుకలను విజయవంతం చేద్దాంటీడీపీనాయకులు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీనాయకులు

ధర్మవరంటౌన్, జనవరి 22 ప్రభాతవార్త

విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ జన్మదిన వేడుకలు, స్వర్గీయ పరిటాలరవీంద్ర వర్ధంతి వేడుకలను విజయవంతం చేద్దామని ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతంకాటమయ్య, నియోజకవర్గ టీడీపీక్లస్టర్ ఇన్చార్జ్ చింతలపల్లిమహేశ్ చౌదరిలు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు...టీడీపీజాతీయ ప్రధానకార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ వేడుకలకు పట్టణ, మండలం నుంచినాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పెద్దఎత్తున తరలిరావాలని విజయవంతం చేయాలన్నారు. పార్టీకార్యాలయంలో కేక్ కట్ చేసి లోకేశ్ జన్నదిన వేడుకలతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా స్వర్గీయ పరిటాల రవీంద్ర వర్ధంతి వేడుకలను కూడా శనివారం ఘనంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. ముందుగా ధర్మవరంలో రవీంద్ర వేడుకలను నిర్వహించిన అనంతరం వెంకటాపురంకు వెళ్లి అక్కడ పరిటాలఘాట్ కు ఘన నివాళులర్పించడం జరుగుతుందన్నారు. పరిటాల రవీంద్ర ఉమ్మడిజిల్లాలో టీడీపీ బలోపేతానికి కృషిచేయడంతోపాటు తిరుగులేని మహారాజుగా ఎదిగారన్నారు. ధర్మవరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో టీడీపీకార్యకర్తలపై దాడులు చేయడం, హత్యలు చేయడం వంటి వాటిని పరిటాలరవీంద్ర అనతికాలంలో అణచివేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీపట్టణ, రూరల్ అధ్యక్షులు పరిసేసుధాకర్, పోతుకుంట లక్ష్మన్న, నాయకులు పణికుమార్,సంధారాఘవ, పురుషోత్తంగౌడ్, చింత పులుసు పెద్దన్న చట్టాలక్ష్మీనారాయణ, గొట్లూరుశీన, మాదవరెడ్డి, విజయ సారధి, కేశగాళ్లశీన, చట్టా లక్ష్మీనారాయణ, బాబుసాబ్,మేకలరామాంజినేయులు, వంట రమేష్,బీరే శ్రీనివాసులు,చీమలరామాంజి, వరదరాజులు శ్రీనివాసరాజు,మార్కెట్ రహీం, టైలర్ గోపాల్,సీబీఎన్ రామకృష్ణ, పోతుకుంట రమేశ్‌చిన్నూరులోకేశ్,ఆటోవలి,మేకలలోకేష్,పల్లపురవీంద్ర,పల్లపు శివశంకర్,కామ్లేశివకుమార్,హేమరాజు,వెంకటనారాయణ, తిరుపాల్ పాల్గొన్నారు.

## మన సొమ్ముకు... మనమే భద్రత...!

ధర్మవరం రూరల్ జనవరి 22 ప్రభాతవార్త



పథకాలు అమలు పై సభ్యులకు అవగాహన కల్పిస్తున్న డిపిఎంఐబి సత్యనారాయణ

స్వయం సహాయక సంఘాల ద్వారా పొదుపు చేసుకున్న సొమ్ముతో పాటు బ్యాంకుల ద్వారా తీసుకున్న అప్పు రుణాలు... రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పావలా వడ్డీలు.. వంటి మన డబ్బుకు మనమే లెక్కలు తెలుసుకోవలసిన బాధ్యత ప్రతి మహిళా సభ్యురాలుపై ఉందని మండల సమైక్య అధ్యక్షురాలు ప్రమీల పేర్కొన్నారు. గురువారం ధర్మవరం డి ఆర్ డి ఏ వెలుగు కార్యాలయంలోని దుర్గ భవాని మండల సమైక్య నందు ఈ నారీలకు సిఆర్‌పి లకు మొదటి రోజు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎంఐబి సత్యనారాయణ గ్రామస్థాయిలో ఈనారీల వ్యూహం, మన డబ్బులు మన లెక్కలు,సంస్థాగతనిర్మాణం,బ్యాంకు లింకేజీ,వార్షికజీవనోపాధుల ప్రణాళిక, ఉన్నతి , స్త్రీనిధి రుణాలు ఆరోగ్యం పౌష్టికాహారం, జెండర్, జీవనోపాదులు మరియు ప్రభుత్వ పథకాలు అమలు చేయడం పై సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈవోలతో కలిసి టీమ్‌వర్క్ చేయాలన్నారు. తీసుకున్న రుణాలు, చెల్లింపులపై సంఘసభ్యులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. గుడ్డిగా నమ్మి సంతకాలు చేసి మోసపోకుండా చైతన్యవంతంగా మహిళలు ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రఘునాథరెడ్డి, సీసీలు వరప్రసాద్ రెడ్డి, నారప్ప, కిష్టప్ప, శివారెడ్డి, పోతులయ్య,ఎమ్మెస్ అకౌంటెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు అవగాహన కమిటీ వెబ్‌సైట్ ప్రారంభం

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము జనవరి 22 ప్రభాతవార్త:



సమాచార హక్కు అవగాహన కమిటీ వెబ్సైట్ను ప్రారంభిస్తున్న దృశ్యం

సమాచార హక్కు అవగాహన కమిటీ సేవలను విస్తరించే దిశగా మరో అడుగు ముందుకు వేసింది. కమిటీ వ్యవస్థాపకులు హబీబుర్ రెహమాన్ ఆధ్వర్యంలో ప్రజలకు, ఆర్టీఐ కార్యకర్తలకు, ప్రజా సమాచార అధికారులకు మరింత ఉపయోగకరంగా ఉండే విధంగా రూపొందించిన www.rtiawareness.com వెబ్‌సైట్‌ను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిసి, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఈ వెబ్‌సైట్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఆర్టీఐ దరఖాస్తులు, చట్టసంబంధిత సమాచారం, మార్గదర్శకాలు, తాజా పరిణామాలు వంటి అంశాలను ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు చేరవేయనున్నట్లు తెలిపారు. ఆర్టీఐపై అవగాహన పెంచి, ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని సులభంగా పొందే అవకాశాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## వేరుశనగలో పొలంబడి

రామగిరి, జనవరి 22 ప్రభాతవార్త



పొలం బడి నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని గంతిమర్రి గ్రామంలో వేరుశనగ పంటలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. డాట్ సెంటర్ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, వేరుశనగపంటపై రైతులకు పలు సూచనలు అందించారు. వేరుశెనగలో ప్రస్తుతం తిక్క,ఆకుమచ్చతెగుళ్లు ఉందని, దానికి ఏ విధమైన మందులు వాడాలో తెలియజేశారు. వరినార దశలో ఉన్నప్పుడు అది ఏ విధంగా సంరక్షించుకోవాలో తెలియజేశారు. రబీసీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు ఈ నెలాఖరులోగా చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు. అదే విధంగా కంది కొనుగోలు గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏక కవిత, ఏఈఓ షరీఫ్, అధికారులు పాల్గొన్నారు.

## కదిరిలో జరిగే కిసాన్ మేళాకు తరలివెళ్లిన బంజారా రైతులు

**- ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించడం అవగాహనకై కిసాన్ మేళా**

ఉరవకొండ, జనవరి 22 ప్రభాతవార్త



ఉరవకొండ నుండి కదిరిలో జరిగే కిసాన్ మేళాకు తరలివెళుతున్న బంజారా నాయకులు

కదిరిలో జరిగే కిసాన్ మేళాకు గిరిజన రైతులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కొరతను సరిదిద్దడంతోపాటు విద్య, వైద్యం, అంగన్‌వాడీ కేంద్రాలను అందుబాటులోకి తేవడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కదిరిలో అధునాతన శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించే విధానంపై అవగాహన కల్పించడానికిగాను కిసాన్ మేళను ఏర్పాటు చేయగా బంజానా నేత ఎస్.కె.కేశవనాయక్ ఆధ్వర్యంలో రూపానాయక్ తండా, చిన్న తండా గ్రామాలకు చెందిన రైతులు ఉరవకొండలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు ద్వారా కిసాన్ మేళకు తరలివెళ్లారు. రైతులను స్థానిక ఏడీఏ సత్యనారాయణ, వజ్రకరూరు ఏవో మధుకర్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది రామకృష్ణనాయక్, మోహన్‌నాయక్ సాగనంపారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం ప్రతినిధి ఎస్.కె.సుబ్రమణ్యంనాయక్ మాజీ జెడ్పీటీసీ తులసీదాస్ నాయక్, వీఎస్ఎస్ మాజీ అధ్యక్షులు టి.వాల్యానాయక్, దాక్యనాయక్, దేవుల నాయక్, వెంకటేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ డిపో ముందు నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ రిలే నిరాహార దీక్షలు

**- ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్**

ఉరవకొండ, జనవరి 22 ప్రభాతవార్త



ఉరవకొండ ఆర్టీసీ డిపో ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ బాధ్యులు

ఉరవకొండ ఆర్టీసీ డిపో ముందు గురువారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ రిలే నిరాహార దీక్షలు చేపట్టింది. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సి.ఓబులేసు, యం.నారాయణస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో తొలిరోజు సి.బాలకృష్ణ, వి.మల్లికార్జున, యు.సి.మధు, వి.మధుబాబు, కె.నాగన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కడప జోన్‌లో ఉన్న అన్ని డిపోల్లో ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/19ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల పదోన్నతులకు సంబంధించి న్యాయ ప్రక్రియ ద్వారా ఉన్న అడ్డంకులను తొలగించి వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. ఆర్టీసీ సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అన్ని కేటగిరిల్లో ఉన్న ఖాళీలను పదోన్నతులద్వారా భర్తీచేయాలనికోరారు. టెక్నాలజీకు అనుగుణంగా మెయింటెనెన్స్ విభాగంలో టూల్స్, మెటీరియల్స్ తెప్పించాలని, మహిళా సిబ్బందికి ఉన్న రెస్ట్ రూముల్లో సరైన వసతులు కల్పించాలని, జి.ఓ.ఎం.ఎస్ నంబర్ 70ప్రకారం చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేస్తూ వివిధ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వి.వీరేష్‌గౌడ్, కె.రామకృష్ణ, సి.శ్రీరాములు, కె.సాంబశివ, గోవిందప్ప, జి.వలి, అబ్దుల్లా, హెచ్.జి.సురేష్‌కుమార్, యం.శ్రీనివాసులు, పి.దస్తగిరి, హెచ్.జి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శిగా బసవరాజు

అగళి, జనవరి 22 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బసవరాజు

భారతీయ జనతాపార్టీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మందాలపల్లి బసవరాజును బిజెపి అధిష్టానం నిర్ణయించి నియమించింది. నిరంతరం బిజెపి పార్టీ అభివృద్ధి కోసం కష్టపడుతున్న బసవరాజుకు బిజెపి పార్టీ తగిన గుర్తింపును ఇచ్చింది. రాష్ట్ర ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శిగా బసవరాజు నియామకం కావడానికి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, రాష్ట్ర మహాసంఘటన మంత్రి మధుకరణి, రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షులు సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, దళిత మోర్చ ఇన్‌చార్జ్ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు శేఖర్, జాతీయ కౌన్సిల్ మెంబర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవానంద్, మాజీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌలి, బిజెపి సీనియర్ నాయకులు ఎన్‌కె.వీరచిక్కప్ప, అశోక్, నాగేంద్రప్ప తదితరులు హర్షం వ్యక్తం చేశారు. బసవరాజు, మరిన్ని ఉన్నత పదవులను భారతీయ జనతా పార్టీలో అధిరోహించాలని ఆకాంక్షించారు.

## జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

**- వైద్య శిభిరాన్ని ప్రారంభించిన ఎంపిపి, సర్పంచు**

**- కోడిపల్లిలో పశువైద్య శిభిరం**

అగళి, జనవరి 22 ప్రభాతవార్త



వైద్య శిభిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి, సర్పంచు

కోడిపల్లి గ్రామంలో పశు వైద్య శిభిరాన్ని ఎంపిపి రేణుకా కామరాజు, సర్పంచు నరసింహ మూర్తి ప్రారంభించారు. డా.కిషోర్, వెటర్నరీ అసిస్టెంట్ శివన్న, సిబ్బంది, మేకలు గొర్రెలకు, అదే విధంగా ఆవులు గొ ర్రెలకు వ్యాక్సినేషన్ చేశారు. మందులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ.. పశువైద్య శిభిరం ద్వారా రోగాల భారిన పడిన జీవాలకు చికిత్స చేయించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆవులకు, గేదెలకు భీమా సౌకర్యాన్ని కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతన్నలు వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రమేష్ ఎంపిటిసి చంద్రప్ప, రైతులు పాల్గొన్నారు.

## పట్టాలను సద్వినియోగం - జడ్పిటిసి, ఎంపిపి

అగళి, జనవరి 22 ప్రభాతవార్త



పట్టాల పంపిణీపై సమీక్ష చేస్తున్న దృశ్యం

శుక్రవారం మడకశిర జూనియర్ కళాశాల ఆవరణంలో నియోజకవర్గంలో 10వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి శ్రీకారం చుట్టారని, అందులో భాగంగానే పట్టాల పంపిణీపై లబ్దిదారులను ఎలా మడకశిరకు తీసుకెళ్లాలని అన్నదానిపై ఎంపిపి రేణుకా కామరాజు, జడ్పిటిసి ఉమేష్, ఎంపిడిఓ గంగాధర్, డిప్యూటీ ఎంపిడిఓ రెడ్డి ప్రకాష్, ఏఓ రాజేంద్ర ప్రసాద్, కన్వీనర్ తిప్పేస్వామి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్‌మూర్తి, ఏపిఓ మంజునాథ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

## వ్యవస్థాపన అభివృద్ధి దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుంది

**- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ**

**- కళాశాలలో అంకురాల ఆలోచన-వ్యవస్థాపన వృద్ధి కార్యక్రమం**

ఉరవకొండ, జనవరి 22 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ



హాజరైన విద్యార్థులు

వ్యవస్థాపన అభివృద్ధి దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుంది కనుక విద్యార్థి దశ నుంచే వ్యవస్థాపనపై అవగాహన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంకురాల ఆలోచన-వ్యవస్థాపన వృద్ధి అనే కార్యక్రమం రతన్‌టాటా ఇంకుబేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కళాశాల విద్యా కమీషన్ ఆదేశాల మేరకు కళాశాల వాణిజ్య విభాగం పర్యవేక్షణలో వ్యవస్థాపన అభివృద్ధి విభాగం సమన్వయకర్త, వాణిజ్య విభాగాధిపతి నీలి వెంకటేసులు ఆధ్వర్యంలో నిర్వహించగా ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్.మస్తానప్ప మాట్లాడుతూ విద్యార్థులు నూతనంగా ఆలోచించి ప్రజా అవసరాలు గుర్తించి అంకురాలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా॥కె.ఎం.రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ స్థాయికి పరిమితం కాకుండా ఉద్యోగ ఉపాధి కల్పన స్థాయికి ఎదగాలని సూచించారు. రుసా సమన్వయకర్త డా॥జి.అయ్యన్న మాట్లాడుతూ స్థానిక వనరులను ఉపయోగించుకొని విద్యార్థులు వ్యవస్థాపకులుగా స్థిరపడాలన్నారు. కంప్యూటర్ విభాగాధిపతి ఎం.సుధాకర్ మాట్లాడుతూ వ్యవస్థాపకునికి ఆలోచన సృష్టి అనేది చాలా ముఖ్యమని పలు ఉదాహరణలను వివరించారు. వ్యవస్థాపన అభివృద్ధి కో ఆర్డినేటర్ నీలి వెంకటేసులు మాట్లాడుతూ కళాశాల విద్య, (ఆర్‌టీఐహెచ్) వారు నిర్వహించే రెండు సర్టిఫికేట్ కోర్సులకు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని వివరిస్తూ వ్యవస్థాపన అనేది నిరుద్యోగ నిర్మూలణకు దేశ ప్రగతికి దారి తీస్తుందన్నారు. సర్టిఫికేట్ కోర్సులలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర వ్యాప్తంగా 60 మందిని ఎన్నుకొని మంగళగిరి వ్యవస్థాపన ఇంకుబేషన్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య అధ్యాపకులు డి. ప్రభాకర్, జె.నాగేంద్రరెడ్డి, బి.రామాంజినేయులు, జేకేసీ కో ఆర్డినేటర్ కె.పి.నాగేంద్ర పాల్గొన్నారు.

## రోడ్లు చిధ్రం... ప్రయాణం నరకం...!..

**గమ్యం చేరాలంటే గగనమే...**

ధర్మవరం రూరల్ జనవరి 22 ప్రభాతవార్త



దర్శిమల నుండి నడిమిగడ్డ పల్లి రోడ్



నడిమగడ్డిపల్లి నుండి మాల గుండ్లపల్లి రహదారి



కంకర తేలిన నడిమి గడ్డిపల్లి నుండి వెంకట తిమ్మాపురం దారి

ధర్మవరం మండల పరిధిలోని గ్రామీణ రోడ్లు చిధ్రంగా మారడంతో.. ప్రయాణం నరకయాతనగా మారింది. గమ్యం చేరాలంటే గగనంగా మారిందని గ్రామీణ ప్రజలు వాపుతున్నారు. వాహనంపై వెళ్లాలంటే ఒళ్ళు గుళ్ళు అవుతుందని ఆవేదన వ్యక్తం. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి పల్లె రహదారులు ప్రగతి బాట పట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామాల రోడ్ల పరిస్థితి ఇలా... ధర్మవరం పట్టణం నుంచి గ్రామీణ రోడ్లు అద్వానంగా ఉన్నాయి. దర్శనమల నుంచి నదీవి గడ్డపల్లి, కొడవగానిపల్లి అడుగడుగున కంకర తేలాయి. రహదారులపై గుంతలు పడ్డాయి. అదేవిధంగా కొడవగానిపల్లి నుంచి వెంకట తిమ్మాపురం వెళ్లి రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని వాహన శోధకులు వాపోతున్నారు. ముచ్చిరామి నుంచి కట్టకిందపల్లి వరకు ఉన్న రోడ్డును సగం వరకు తార్ రోడ్డు వేశారు. మిగిలిన సగభాగం మట్టి రోడ్డుపై గుంతలు ఉండటం వల్ల ప్రయాణం నరకంగా ఉంది. గొల్లపల్లి నుంచి ఉపనేషణ పల్లి గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో వేగంగా వస్తున్న వాహన సదకులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. పల్లెటూరి రోడ్లపై ప్రగతి సాధించే విధంగా పాలకులు , కార్యరూపం దాల్చాలని ఆయా గ్రామ ప్రజలు విన్నవిస్తున్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి

**ఎస్ఇసి మెంబర్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి**

తాడిమర్రి జనవరి 22 (ప్రభాతవార్త)



సమావేశంలో మాట్లాడుతున్న తాడిమరి చంద్రశేఖర్ రెడ్డి

గ్రామస్థాయిలో వైఎస్సార్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తాడిమర్రి వైయస్సార్ పార్టీ గ్రామ అనుబంధ కమిటీ ఏర్పాటు సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరుకష్టపడి పార్టీ గెలుపుకోసం పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిమర్రి పంచాయతీ అబ్జర్వర్ పాటిల్ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి ఒక్క గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటుచేసి వైయస్సార్ పార్టీని పటిష్ట స్థితిలో ఉంచాలన్నారు. అదేవిధంగా అధికార పార్టీ చేస్తున్న అరాచకాలను, అన్యాయాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, ఎంపీటీసీ లక్ష్మన్న, కోఆప్షన్ సభ్యుడు బాబా, మాజీసచివాలయ కన్వీనర్లు అల్లే సాయినాథ్ రెడ్డి, మల్లప్పగారి మాధవరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మదనమోహన్ రెడ్డి, విశ్వనాథ్, చింతకాయల రెడ్డప్ప,సిద్దే రవిచంద్రరెడ్డి, శివ, గురుప్రసాద్, హరి,యల్లప్ప, గంగాధర్, చెన్నప్ప, అంజి, నరసింహుడు, రమేష్, లక్ష్మీనారాయణ, తిలక్, ఆదినారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు

**పుట్టపర్తి టౌన్, జనవరి 22, ప్రభాతవార్త**

నేషనల్ మజ్దూర్ యూనియన్, జోనల్ కమిటీ పిలుపు మేరకు జనవరి 22 న జోనల్ వ్యాప్త సమస్యల పై పుట్టపర్తి డిపో ముందు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, శ్రీరామ్ నాయక్ , శ్రీ షబ్బీర్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించి దీక్షలో వారికి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలలో సంఘీభావంగా రీజినల్ ఉపాధ్యక్షులు బాబ్జాన్ , డిపో ముఖ్య సలహాదారుడు అప్పి రెడ్డి, డిపో అధ్యక్షులు శివ శంకర్ డిపో కార్యదర్శి గంగులయ్య,డిపో ట్రెజరర్ శివారెడ్డి రీజినల్ ఉపాధ్యక్షురాలు మహిళా నాయకురాలు తిరుపతమ్మ పాల్గొని మద్దతు తెలిపారు. కడప జోనల్ వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ముఖ్యంగా కడప జోనల్ అన్ని డిపోలలో 1/2019 సర్క్యులర్ ను అమలు చేయాలని, డ్రైవర్ కండక్టర్ మెకానికులకు ప్రమోషన్స్ ఇవ్వాలని, అన్ని కేటగిరిలో ఖాళీలను భర్తీ చేయాలని, మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండుచేశారు. ఈ నిరాహార దీక్షలో కండక్టర్లు తిరుపతమ్మ ,విజయలక్ష్మి, ప్రేమ కుమారి,నాగరత్నమ్మ కుళ్లాయప్ప, సుధాకర్, శివ శంకర్ రెడ్డి ,గంగులయ్య , రంగనాథ్ ,నారాయణ డ్రైవర్లు మోహన్, ఈశ్వరప్ప లక్ష్మీపతి, కేశవులు, బాబయ్య ,రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సుద్దకుంట పల్లిలో గడ్డివాముల దగ్ధం

**రామగిరి, జనవరి 22 ప్రభాతవార్త**



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామంలో రెండు గడ్డివాములు దగ్ధమై దాదాపు రూ. 50 వేలకుపైగా నష్టం వాటిల్లింది. సుద్దకుంటపల్లి గ్రామానికి చెందిన గొల్లచిన్న అంజి, గొల్ల రామాంజి నేయులు అన్నదమ్ములు, వీరి పొలంలోనే వేరుశనగకట్టి, వరిగడ్డి వాములు వేసుకున్నారు. వీరితోట పక్కనే బీడు భూమి ఉండటంతో ఆ భూమికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ బీడుభూములలో నిప్పు గడ్డివాములకు అంటుకుంది. దీంతో మూడు బండ్లు వేరుశనగ గడ్డి, 10 బండ్లు వరిగడ్డివాము కాలిబూడిదైంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. పశుగ్రాసం కాలిబూడిదవ్వడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## ఈనెల 25న రథసప్తమి మహోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

### ఆలయ అడహాక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర్ ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు

**ధర్మవరం జనవరి 22 ప్రభాతవార్త**



పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోగల శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీన రథసప్తమి మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అడ హక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఉభయ దాతల సహకారంతో ఒకే రోజున ఏడు వాహనములలో స్వామి వారు పట్టణ పురివీధులలో సూర్యప్రభ, శేష, గరుడ, హనుమత్, కల్ప వృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనములలో స్వామి వారు ఊరేగుతారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తదితరులు హాజరవునున్నట్లు వారు తెలిపారు.

## ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన సిఐ రాజ్ కుమార్



ప్రజలతో మాట్లాడుతున్న సిఐ రాజ్ కుమార్

**గుడిబండ జనవరి 22 ప్రభాతవార్త**

మండల పరిధి లోని హిరేతుర్పి గ్రామంలో నేటి నుండి జరిగే శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సిఐ రాజ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి గొడవలు, అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, గ్రామ పెద్దలు శ్రీరామప్ప, దాసన్న, కరియన్న, హనుమంతరాయప్ప, శ్యాం సుందర్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## పట్టపగలే వృద్ధుడి చేతి నుంచి బంగారు ఉంగరం దోపిడీ

**కంబదూరు, జనవరి 22, ప్రభాతవార్త**



పట్టపగలే వృద్ధుడి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని గుర్తు తెలియని దుండగుడు ఎత్తుకెళ్లిన ఘటన కంబదూరులో గురువారం కలకలం రేపింది. మండల కేంద్రం పాత స్టేట్ బ్యాంక్ సమీపంలోని ఎరువుల దుకాణం వద్ద నిలబడి ఉన్న వృద్ధుడి చేతి వేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని గుర్తించిన దుండగుడు ద్విచక్ర వాహనంలో వచ్చి మాటలతో దృష్టి మళ్లించి ఒక్కసారిగా ఉంగరాన్ని లాగేసుకుని పరారయ్యాడని బాధితుడు మీడియాకు తెలిపారు. ఈ ఘటనతో వృద్ధుడు భయాందోళనకు గురయ్యాడు. చుట్టుపక్కల వారు వెంటనే స్పందించినా అప్పటికే దుండగుడు తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. బాధితుడు కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎరుకుల ఈరన్న గా తెలుస్తోంది.

## డీఏ అరియర్స్ జమలలో వ్యత్యాసాలను తొలగించండి

### - ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.సి.ఓబన్న, రాష్ట్ర కౌన్సిలర్ ఎం. శ్రీనివాసులు - విడపనకల్లు మండల శాఖ నూతన అధ్యక్షుడిగా సాకే మునిస్వామి



విడపనకల్లు మండలశాఖ నూతన అధ్యక్షుడు సాకే మునిస్వామిను సన్మానించిన దృశ్యం

**ఉరవకొండ, జనవరి 22 ప్రభాతవార్త**

సీపీఎస్ ఉద్యో గులకు డీఏ అరి యర్స్ జమలలో వ్యత్యాసాలను తొలగించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.సి. ఓబన్న, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.శ్రీని వాసులు కోరారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం సాయంత్రం విడపనకల్లు మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. విడపనకల్లు మండల శాఖ అధ్యక్షుడి రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో నూతన అధ్యక్షుడిగా సాకే మునిస్వామిను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బి.సి.ఓబన్న, ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ అరియర్స్ ను విడుదల చేసిందని అయితే సాంకేతిక కారణాలవల్ల అనేక మందికి అరియర్స్ జమ కాలేదన్నారు. ఆర్థిక శాఖ అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్సి ను వెంటనే ప్రకటించి అమలు చేయాలని, మూల్యాంకనంలో బుక్ లెట్ విధానానికి స్వస్తిపలకాలని డిమాండ్ చేశారు. 2022 నుంచి పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బండారు నారాయణస్వామి, ఉరవకొండ మండల శాఖ గౌరవాధ్యక్షులు ఆర్.లోకేష్, ప్రధాన కార్యదర్శి వై.భువనేశ్వర చౌదరి, వజ్రకరూరు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.ధనుంజయ, జిల్లా కౌన్సిలర్లు బి.చంద్ర, ఎ.కృష్ణ, ఆది రాజేష్, భూమా రామాంజనేయులు, నగేష్, డి.వన్నూరు స్వామి, వీరేష్, ఎం.భాస్కర్, వెంకటస్వామి, ఎం.సోమశేఖర్, ఎం.రవి, బి.మల్లేష్, ఆవుల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నాటు కోళ్ల చోరి కేసులో ఇద్దరు అరెస్ట్

**బత్తలపల్లి, జనవరి 22 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వేల్పుమడుగు రోడ్డులో ఉన్న రాజేష్ నాటు కోళ్ల ఫారం లో నాటు కోళ్ల దొంగలించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సోమశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని వేల్పుమడుగు రోడ్డులో నాటు కోళ్ల ఫారం నిర్వహిస్తున్న రాజేష్ ను ఈనెల 12న బెదిరించి 60 నాటుకోళ్లను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసును ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని చేదించారు. ఈ కేసులో ముద్దాయిలు అనంతపురం నకు చెందిన రాజేష్, రాప్తాడుకు చెందిన దొమ్మర మురారి గంగప్పలను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయబడిన మూడు ప్రత్యేక బృందాలు, ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్, ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ధర్మవరం టూ టౌన్ సిఐ రెడ్డప్ప, బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్, బత్తలపల్లి కానిస్టేబుళ్లు సుదర్శన్ నాయుడు, పెద్దన్న, ధర్మవరం టూ టౌన్ కానిస్టేబుల్ రాజప్ప, ధర్మవరం సబ్ డివిజన్ క్యాట్ టీమ్ కు చెందిన షాకీర్ కోళ్లను దొంగలించిన నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి బత్తలపల్లి, కనగానపల్లి, ధర్మవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో నమోదు కాబడిన వివిధ దొంగతనం కేసులలో ప్రాపర్టీని రికవరీ చేసి ఇద్దరినీ రిమాండ్కు పంపినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న వారందరిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు పోలీసులు తెలిపారు.

## వికలాంగులు ఆత్మస్థైర్యంతో జీవించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీటి ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్

**బత్తలపల్లి, జనవరి 22 ప్రభాతవార్త**

వికలాంగులు తమ వికలత్వాన్ని విస్మరించి ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లినప్పుడే సకలాం గులతో సమానంగా ఎదుగుతారని ఆర్డీటి ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్డీటి ఫీల్డ్ కార్యాలయంలో దివ్యాంగుల పరస్పర సహాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, బత్తలపల్లి రీజియన్ బ్యాంకును ముఖ్యఅతిథిగా హాజరై ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆర్డీటి సహకారంతో ఇప్పటికే వికలాంగులు అందరూ ఆత్మస్థైర్యంతో ముందుకు వెలుతున్నారన్నా రు. ఈ బ్యాంకును వికలాంగులే నడుపుకుంటూ రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఆమె కోరారు. వికలాంగులు అందరూ ఈ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు సభ ప్రారంబంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి వికలాంగుల శాఖ డైరెక్టర్ రఫిక్, రీజనల్ డైరెక్టర్ హనుంతప్ప, ఆర్డీటి సిబ్బంది, వికలాంగులు దాదాపు 450 మంది హాజరయ్యారు.

## కంది లో పంటకోత ప్రయోగాలు



పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

**బత్తలపల్లి, జనవరి 22 ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన కంది పంటలో పంట దిగుబడి అంచనా నిమిత్తం పంటకోత ప్రయోగాలను పలు గ్రామాలలో ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనర సింహశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం మండలంలోని ఓబులాపురం, రాఘవంపల్లి గ్రామాలలో కంది పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఓబులాపురంలో సర్వే నెంబర్ 3106 సర్వే నెంబర్లో రైతు చెన్నయ్య సాగుచేసిన కంది పంటలో 1010 విస్తీర్ణం కొలతలలో పంటకోత ప్రయోగాలను విపిఎ చిగిచెర్ల నాగార్జున నిర్వహించారు. రాఘవంపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 302, శ్రీనివాసులు సాగు చేసిన సర్వేనెంబర్ 221 బి పొలంలో 1010మీటర్లు కొలతలతో కందిలో పంటకోత ప్రయోగాలను విఎస్ఏ నిర్వహించారు. పంటకోత ప్రయోగాలను జిల్లా గణాంక శాఖ కార్యాలయం డివైఎస్ఓ కృష్ణనాయక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ గణాంకాధికారి కెఎస్ లక్ష్మీనరసింహశర్మ, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి మంజునాథ, విఏఏ చిగిచెర్ల నాగార్జున, విఎస్ఏ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిసత్యకుమార్ ఆదేశాలతో కదిలిన నీటిపారుదల అధికారులు

### చెరువుల నింపుదలపై పూర్తిస్థాయిలో కృషిచేస్తాం-నీటిపారుదల శాఖ అధికారులు

**ధర్మవరంటౌన్, జనవరి 22 ప్రభాతవార్త**



హెచ్ఎల్ సీ అధికారులతో మాట్లాడుతున్న నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు

సాగునీటి దృష్ట్యా ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాలికలతో నీటివిడుదలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంబంధిత నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు, హెచ్ఎల్ సీ అధికారులుతో కలిసి గురువారం పీఏబీఆర్ కుడి కాలువ వెంబడి పర్యటించారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, కనగానపల్లి, కూడేరు మండలాల్లోని మొత్తం 42 చెరువులకు నీరు అందించాల్సిన అవసరం ఉందని అందులో బాగంగా చివరి చెరువుకు ముందుగా నీరు చేరేలా మొదటి చెరువులకు అనంతరం విడుదల చేయాలన్న స్పష్టమైన సూచనలు చేశారు. పీఏబీఆర్ వద్ద నుంచి దాదాపు114 కిలోమీటర్ల మేర నీరు ప్రవహిస్తే తప్ప చివరి చెరువుకు చేరదన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి విడుదలను జాగ్రత్తగా ప్రణాలిక బద్ధంగా నిర్వహించాలన్నారు. కాలువకు ఎక్కడా గండ్లు వేయకుండా హెచ్చరికలు జారీచేయాలని, అలాగే నీటి చౌర్యంజరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పీఏబీఆర్ కుడికాలువ వెంట పోలీసుల ద్వారా గస్తీ నిర్వహించడంతోపాటు కాలువ నిర్వహణను పర్యవేక్షించాలని స్పష్టంచేశారు. అదేవిధంగా ధర్మవరంరూరల్, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో చెరువులను ముందుగానే నింపడం ప్రథమ ధ్యేయగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈఅశాలపై అనంతపురంజిల్లా కలెక్టర్, ఎస్పీ, హెచ్ఎల్సీ ఎస్ఈ అధికారులతో మంత్రిపోన్లో చర్చించారు. అనంతరం హెచ్ఎల్సీ అధికారులు మాట్లాడుతూ.... నియోజకవర్గంలో ఉన్న అన్ని చెరువులను నింపేదిశగా పూర్తిస్థాయిలో ప్రయత్నం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతుల సాగునీటి అవసరాలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ప్రతి పంట సాగు విజయవంతం అయ్యేలా అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎల్సీ ఎస్ఈ సుధాకర్, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ రాదాకృష్ణ, ఏఈ శివశంకర్, బీజేపీ నాయకులు పోతుకుంటరాజు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీ నుండి టిడిపిలో చేరిక.



వైసిపి కార్యకర్తలకు పసుపు కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్ జనవరి 22 ప్రభాతవార్త**

మడకశిర పట్టణంలో గురువారం మండలం ఎగువ రామగిరి గ్రామానికి చెందిన వైసిపి పార్టీ నాయకులు మంజప్ప.జగదీష్. నరసింహమూర్తి.లు వైసిపి పార్టీని వీడి టిడిపి పార్టీలోకి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో వారికి పసుపు కండువ కప్పి టిడిపి పార్టీలోకి ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి. టిడిపి నాయకులు. తదితరులు పాల్గొన్నారు ,

## గొట్లూరు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయవిగ్రహ ఏర్పాటుకు నా సంపూర్ణమద్దతు - చిలకం

**ధర్మవరంటౌన్, జనవరి 22 ప్రభాతవార్త**



చిలకం మధుసూదన్రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గొట్లూరు గ్రామస్థులు

మండల పరిదిలోని గొట్లూరు గ్రామంలో కృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు నాసంపూర్ణ మద్దతు ఇస్తానని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గొట్లూరు గ్రామస్థులు గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో చిలకం మధుసూదన్ రెడ్డిని కలిసి గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు కొందరు గ్రామస్థులు అడ్డుపడుతున్న నేపథ్యంలో ఈ విషయంపై వినతిపత్రం అందజేశారు. అనంతరం చిలకం మాట్లాడుతూ... గతంలోనే శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు తన సంపూర్ణ మద్దతుతో పాటు సహాయ సహకారాలు అందించానని, భవిష్యత్తులో కూడా అదే విదంగా పూర్తీ మద్దతు కొనసాగుతుందన్నారు. కృష్ణదేవరాయలు మహోన్నత వ్యక్తి అని భారతదేశ చరిత్రలో విశిష్టస్థానం సంపాదించిన మహానుబావుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయడం తప్పనిసరి అన్నారు. ఆయన సేవలు, త్యాగాలు, పాలన విదానం భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కొందరు గ్రామస్థులు అడ్డుకుంటున్న కూడా అంశాన్నిసానుకూలంగా పరిష్కరించేందుకు జనసేన పార్టీ ప్రతినిధులను గ్రామానికి పంపించి వారితో చర్చలు జరిపిస్తామన్నారు. అవసరమైతే తానే స్వయంగా గ్రామానికి వచ్చి గ్రామపెద్దలతో మాట్లాడి అందిరి సహకారంతో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఈ విషయంపై సంబంధిత అధికారులతో కూడా మాట్లాడి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

## నేడు 10వేల ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయండి

**అమరాపురం జనవరి 22 ప్రభాతవార్త**



టిడిపి మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి దృశ్యం

అమరాపురం మండల పరిధిలో ఉన్న ఇండ్ల పట్టాల మంజూరు కొరకు దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడు నేడు ఉదయం 10 గంటలకు మడకశిర పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి చేతులమీదుగా ఇండ్లపట్టాల పంపిణీ చేయడం జరుగుతుందని మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఎం నాగరాజు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐటీవిద్యాశాఖ మాత్యులు నారాలోకేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో ఇండ్ల పట్టాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నటువంటి ప్రతి లబ్ధిదారుడు స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా మాజీ శాసనమండలి గుండుమలతిప్పేస్వామి చేతుల మీదుగా ఇండ్ల పట్టాలను అందుకోవాలని వారు తెలియజేశారు. ప్రతి లబ్ధిదారుడు మడకశిర పట్టణానికి విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ జీఓ, సంస్థ సర్క్యులర్లు అమలు చేసే వరకు పోరాడుతాం

### రిలే నిరాహారదీక్షలో ఎన్ఎంయూ రీజనల్ చైర్మన్ ముత్యాలప్ప



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నఎన్ఎంయూ నాయకులు

**ధర్మవరంటౌన్, జనవరి 22 ప్రభాతవార్త**

ప్రభుత్వ జీఓ, సంస్థ సర్క్యులర్లు అమలు చేసే వరకు పోరాడుతామని ఎన్ఎంయూ రీజనల్ చైర్మన్ ముత్యాలప్ప, జోనల్ వైస్ ప్రసిడెంట్ నాగశేఖర్లు తెలిపారు. ఈ మేరకు జోనల్ కమిటి పిలుపు మేరకు జోనల్ వ్యాప్తంగా ఉన్న సమస్యలపై కడప డీపీటీఓ మొండి వైఖరికి నిరసనగా గత 66 రోజులుగా కడపలో జరుగుతున్న నిరాహార దీక్షలకు మద్దతుగా గురువారం స్థానిక డిపోఆవరణంలో రిలేనిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఎన్ఎంయూ నాయకులు బి.ఎం.గోపాల్, బత్తినన్న, రమణప్ప, గోపాల్, కదిరప్ప, బి.గోపాల్, అశోక్, మంజునాథ్, శేషులు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా కడప డీపీటీఓ సిబ్బందిపై చేయుచున్న కక్షసాధింపు చర్యలలో కొన్ని వాస్తవాలను పరిశీలించాలన్నారు. గత61 రోజులుగా కడుపు మాడ్చుకుని నిరాహారదీక్షలు చేస్తున్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సంస్థకు, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అధికారులపై ఉద్యమ తీవ్రతను పెంచుతామన్నారు. కడప జోన్. ఉన్న అన్ని డిపోలలో ఉద్యోగభద్రత సర్క్యులర్ 1/19ను వెంటనే అమలుచేయాలని, జోన్లో అన్ని కేటగిరిల్లో ఖాళీలను ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయాలని, ఆర్టీసీ సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి మధుసూదన్, డిపో చైర్మన్ హనుమాన్, గ్యారేజ్ అధ్యక్షులు ప్రసాద్, గ్యారేజ్కార్యదర్శి హరిక్రిష్ణ, డిపో కోశాధికారి వైపీఎన్ రెడ్డి, డిపో సీనియర్ నాయకులు పీఎస్ ఖాన్, సీఈసీఎస్ డెలిగేట్ జేఎస్ఈయుడు పాల్గొన్నారు.

## అండర్12 మండల బాలుర క్రికెట్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

**ధర్మవరంటౌన్, జనవరి 22 ప్రభాతవార్త**



మండల బాలుర క్రికెట్టుకు ఎంపికైన క్రీడాకారులను అబినందిస్తున్న క్రికెట్ అసోషియేషన్ మండల అధ్యక్షులు వడ్డేబాలాజీ

అండర్12 బాలుర మండల క్రికెట్ జట్టుకు ధర్మవరం ఆర్డీటీ క్రీడామైదానం నుంచి 10 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు క్రికెట్ అసోసియేషన్ మండల అధ్యక్షులు వడ్డేబాలాజీ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆర్డీటీ క్రీడామైదానంలో ఎంపికైన క్రీడాకారులు బద్రీనాథ్, వేదవ్యాసు, గోవర్ధన్, మణికంఠ, సిద్దార్థ, రాజా, లోహితాక్షప్రజ్వల్, విక్రమాదిత్య, ఆంజనేయులు లను ఆయన అభినందించారు. క్రీడాకారులు క్రికెట్లోరాణించి ధర్మవరం ఆర్డీటీకి పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు. క్రీడలు అట్టడుగు స్థాయి పిల్లల అభివృద్ధికి కృషిచేస్తాయన్నారు.

## ఘనంగా నిఖిల్కుమార్ స్వామి జన్మదిన వేడుకలు

**పావగడ, జనవరి 22 ప్రభాతవార్త**



నిఖిల్ కుమార్ స్వామి బర్త్ డే సందర్భంగా ఒకరికొకరు కేక్ తినిపించుకుంటున్న జెడియస్ పార్టీ నాయకులు

పావగడలో జెడియస్ పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి జన్మదిన వేడుకలు జెడియస్ పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి 38వ జన్మదిన వేడుకలను పి డబ్ల్యూ డి గెస్ట్ హౌస్ ఆవరణంలో నిఖిల్ కుమార్ స్వామి అభిమానులు పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు ఒకరికొకరు కేక్ తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కెయం తిమ్మరాయప్ప, జెడియస్ పార్టీ తాలూకా అధ్యక్షుడు ఎన్ ఏ ఈరన్న, గౌరవాధ్యక్షులు రాజశేఖర్, గోవింద బాబు, నల్లాని సురేంద్ర, శాంతి మెడికల్ దేవరాజ్, గుట్టహళ్లి మణి, ఆప్ బండ గోపాల్, కావలిగెరె రామంజి, భరత్ తదితరులు ఉన్నారు.

## జ్ఞాపకార్థ కూడిక సందర్భంగా దుప్పట్లు పంపిణీ

**గుమ్మఘట్ట జనవరి 22 ప్రభాతవార్త**



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుమ్మగట్ట మండలం గోనబావి గ్రామం నందు షాలేము మినిస్ట్రీ ఆధ్వర్యంలో సువార్తమ్మ పిలిప్పి లేట్ స్వగృహము వద్ద షాలేము ప్రేయర్ హాల్ నందు పిలిప్పి నాలుగవ జ్ఞాపకార్థ స్మరణ కార్యక్రమం మరియు ప్రత్యేక కూడిక దేవుని కృపలో ఘనంగా జరిగింది. ప్రతి ఒక్కరూ సహాయం చేసుకుంటూ దాతృతము కలిగి గొప్ప ఉద్దేశాన్ని మంచి ఆలోచనలు కలిగి జీవించాలని కర్ణాటక ప్రాంత, బెంగళూరు పట్టణం ప్రసంగీకులు దైవజనులు దేవిడ్ మరియు జి ఆర్ సురేష్ ప్రసంగించారు. అదేవిధంగా దేవుని దయలో పిలిప్పి ని, కుటుంబమును కాపాడిన విధమును బట్టి కుటుంబమంతా దేవునికి స్తుతులు చెల్లించారు. ఈ సందర్భంగా అనేకులకు అన్నదానము, ప్రేమ విందు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రసంగికులుగా దేవిడ్, జి, ఆర్ సురేష్ మాట్లాడుతూ....క్రీ శే ఫిలిప్పీ గత నాలుగు సంవత్సరాలు క్రితం ప్రభువు నందు నిద్రించారు. ఈ కార్యక్రమంలో దైవజనులు దేవిడ్, సూరేష్, జయపాల్, యాకోబు, చందు కాదలూరు ఇస్సాకు, సమూయేలు, రాజు, రాము, ముక్కన్న, కృపానందం ఫిలిప్పీ లేట్ సువార్తమ్మ కుమారులు జయరాం, తిమోతి జాన్ పాల్, జాన్సన్, కూతుర్లు మరియమ్మ ,మేరీ జయమ్మ, ఉమక్క, జ్యోతి , కుటుంబ సభ్యులు మారెన్న, ప్రకాష్, రాజన్న, మైలారి, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం బదిలీపై వెలుతున్న కానిస్టేబుల్కు సన్మానం

**బత్తలపల్లి, జనవరి 22 ప్రభాతవార్త**



బదిలీపై వెలుతున్న కానిస్టేబుల్ నాగార్జునను సన్మానిస్తున్న ఎస్ఐ సోమశేఖర్

ప్రతి ఉద్యోగికి తన ఉద్యోగ ధర్మంలో భాగంగా ఒక చోట నుండి మరో చోటికి బదిలీ కావడం సర్వ సాధారణమని ఎస్సై సోమ శేఖర్ పేర్కొన్నారు. బత్తల పల్లి పోలీస్ స్టేషన్లో లో గత ఐదుసంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న బి.నాగార్జున బదిలీపై గోరంట్లపోలీస్‌స్టేషనుకు వెళుతుండగా గురువారం నాగార్జునను బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. ఆయనకు శాలువాకప్పి, పూలమాలలువేసి వీడ్కోలు పలికారు.

